సాక్షి కామారెడ్డి

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



వరద బాధితులకు..

వరద బాధితులను 'గుప్పెడు బియ్యం' ద్వారా మహిళా సంఘాలు ఆదుకోవడం అభినందనీయమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.

- IIలో ▸



భక్తుల కొంగు బంగారం..

కామారెడ్డిలోని తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శారదా ఆలయం భక్తుల కోర్కెలు తీరుస్తూ విరాజిల్లుతోంది.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
36.8 /22.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ మధ్యాహ్నం వేళ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయికి ప్రదర్శనల ఎంపిక

కామారెడ్డి టౌన్ : రాష్ట్ర స్థాయి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) బోధనాభ్యాసన సామగ్రి మేళాకు కామారెడ్డి జిల్లా నుంచి తొమ్మిది ప్రదర్శనలు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాజు శనివారం తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్‌ల నుంచి రెండు చొప్పున, ఉర్దూ నుంచి ఒకటి చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయన్నారు. తెలుగు నుంచి అంబారిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఏం అంజన్‌ప్రసాద్, అయిలాపూర్ ఉపాధ్యాయురాలు ఎస్ పద్మ, ఇంగ్లిష్ నుంచి పాతంగల్ ఖుర్దు ఉపాధ్యాయురాలు ఈ సుజాత, చిన్నమల్లారెడ్డి ఉపాధ్యాయురాలు ఎస్.లావణ్య, గణితం నుంచి ఎల్లంపేట ఉపాధ్యాయుడు జే.శ్రీనివాస్, పద్మాజివాడి ఉపాధ్యాయురాలు అలేఖ్య, ఈవీఎస్ నుంచి ఎస్ఆర్ఎన్‌సీ మాచారెడ్డి ఉపాధ్యాయురాలు ఎం.సుష్మ , ఎక్కపల్లి ఉపాధ్యాయుడు సీహెచ్.అఖిల్, ఉర్దూ నుంచి రాజీవ్‌నగర్ ఉపాధ్యాయురాలు నహీద్ ఫాతిమా తయారు చేసిన నమూనాలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని డీఈవో వివరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



కామారెడ్డి టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రావణి ఐటీఐ, పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోక్సో, వరకట్నం తదితర చట్టాల గురించి వివరించారు. పేదల కోసం ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. న్యాయ వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతి పౌరుడూ తన హక్కులను గౌరవిస్తూ న్యాయాన్ని ఆశ్రయించే ధైర్యం కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి నాగరాణి, కళాశాలల ప్రిన్సిపాల్‌లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగం తగ్గించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామ స్టేజీ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టర్‌ను జిల్లా విద్యుత్ శాఖ అధికారి శ్రావణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. తద్వారా అంతరాయ సమస్యలు ఉండవన్నారు. అలాగే సబ్ స్టేషన్‌లో ప్రత్యేక బ్రేకర్‌ను బిగించారు. కార్యక్రమంలో డీఈ కళ్యాణి చక్రవర్తి, ఏడీఈ నరేశ్, నందకుమార్, ఏఈ గంగాధర్ విజిలెన్స్ విభాగం ఏఈ రంజిత్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జరుపుకుంటాం



బతుకమ్మ పండగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటాం. బొడ్డెమ్మతో మొదలై, తొమ్మిది రోజులపాటు బతుకమ్మను రోజుకో పేరుతో పేరుస్తాం. బతుకమ్మ ఆడిపాడిన తరువాత నిమజ్జనం చేసి నైవేద్యాలు సమర్పిస్తాం. నేను యాభై ఏళ్లుగా బతుకమ్మ పేరుస్తున్నా. పండగ వచ్చిందంటే ఇళ్లంతా సందడిగా ఉంటుంది.

– కైలాస్ వసంత, కామారెడ్డి

బతుకమ్మ ఎంతో ఇష్టం



చిన్నప్పటి నుంచి బతుకమ్మ పండగ అంటే ఎంతో ఇష్టం. పండగకు ముందు నుంచే సిద్ధమవుతాం. ప్రతి పండగకు కొత్త బట్టలు కొనుక్కోవడం ఆనవాయితీగా వస్తోంది. రోజూ బతుకమ్మలను పేర్చి అందరితో కలిసి ఆడుతూ ఆనందంగా గడుపుతాం. సంప్రదాయాలు ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి.

– రమ్య, దోమకొండ

బతుకమ్మను పేర్చడంలో పోటీ



బతుకమ్మ పండగను సంప్రదాయంగా జరుపుకుంటాం. పూర్వ కాలం నుంచి వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మా ఊళ్లో అయితే పెద్ద బతుకమ్మ రోజున పోటీ పడి బతుకమ్మలను పేరుస్తారు. పూలతోనే బతుకమ్మలను పేరుస్తాం. ఎన్ని కొత్తవి వచ్చినా బతుకమ్మ మాత్రం అలాగే కొనసాగుతోంది.

– నల్లవెల్లి బశవ్వ, ఎర్రాపహాడ్, తాద్వాయి మండలం

కామారెడ్డిలోని సాందీపని కళాశాలలో శనివారం బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, సిబ్బంది



పూల పండుగ

బతుకమ్మ వేడుకలు షురూ

- తీరొక్క పూలతో బతుకమ్మలు
- తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు
- అతివలు మెచ్చిన పండుగ



కామారెడ్డిలోని సాందీపని కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పూలనే దైవంగా పూజించే పండగ బతుకమ్మ. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ప్రకృతితో అనుబంధాన్ని తెలియజేసే, మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండుగ వేడుకలు షురూ అయ్యాయి. తొమ్మిది రోజులపాటు రోజుకో పేరుతో తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కూడళ్ల వద్ద అందరూ జమవుతారు. బతుకమ్మలను ఒక్క చోట పెట్టి పాటలు పాడుతూ లయబద్ధమైన చప్పట్లతో బతుకమ్మను ఆడుతారు. తంగేడు, గునుగు, కట్ల పూలతోపాటు చామంతి, బంతి తదితర పూలతో బతుకమ్మలను పేరుస్తారు. ఆఖరి రోజున సద్దుల బతుకమ్మగా పోటీ పడి పెద్దపెద్ద బతుకమ్మలను పేర్చి వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తి శ్రద్ధలతో..

పూలు కోసుకువచ్చి బతుకమ్మలను పేర్చడం అంటేనే సందడి. పూల కోసం గ్రామీణ ప్రాంతాల వారు పొలం గట్లు, మైదాన, గుట్టల ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాల వారు మార్కెట్‌కు వెళ్తుంటారు. పూలతో బతుకమ్మను పేర్చడమనేది ప్రత్యేకమైన కళ. పేర్చిన బతుకమ్మను పూజించడం, చుట్టూ ఆడిపాటడం చెరువుల్లో నిమజ్జనం వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో కొనసాగుతుంది. చాలా ఇళ్లలో బతుకమ్మను పేర్చడానికి మగవారు సహకరిస్తారు. పల్లెపట్టణం తేడా లేకుండా కూడళ్లు బతుకమ్మలతో కళకళలాడుతాయి.

తొమ్మిది రోజుల బతుకమ్మ	
తొలిరోజు	ఎంగిలిపూలు
రెండో రోజు	అటుకుల
మూడో రోజు	ముద్దపప్పు
నాలుగో రోజు	నానబియ్యం
ఐదో రోజు	అట్ల
ఆరో రోజు	అలిగిన (ఈ రోజు బతుకమ్మ పేర్చరు, ఆడరు)
ఏడో రోజు	వేపకాయల
ఎనిమిదో రోజు	వెన్నముద్ద
తొమ్మిదో రోజు	సద్దుల



మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆనందంగా జరుపుకుంటాం



ఎంతో ఇష్టంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయంగా పండగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి సంవత్సరం బతుకమ్మలను పేర్చి ఆడి, పాడుతూ ఆనందంగా జరుపుకుంటాం. పండగ ఎన్నో సంతోషాలను తీసుకువస్తుంది.

– గులెపల్లి అనిత, బాన్సువాడ

పండగొచ్చిందంటే ఎంతో సంతోషం



చిన్నప్పటి నుంచి బతుకమ్మ పండగ అంటే ఎంతో సంతోషపడేవాళ్లం. ఇప్పటికీ బతుకమ్మ వస్తుందంటే అదొరకమైన ఆనందం వస్తుంది. తొమ్మిది రోజులపాటు బతుకమ్మలను పేర్చడం, అందరితో కలిసి వెళ్లి ఒక చోట జమ అవడం, బతుకమ్మ ఆడి చెరువులో వేయడం అంటే మరచిపోలేని అనుభూతి.

– మల్లుగారి రోజ, బీబీపేట

సంతోషాలతో జరుపుకునే పండగ



ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ వచ్చిందంటే మనసులో ఎంతో ఆనందం వేస్తుంది. పండగ సందర్భంగ చేను దగ్గరకు వెళ్లి గునగ, తంగేడు పువ్వులు తెచ్చుకుంటాం. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చడం, ఆడిపాడి అనంతరం చెరువులో వేయడం, ఊరు వాళ్లందరం కలవడం ఆనందంగా అనిపిస్తుంది.

– శేకెల్లి సాత్విక, అడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివనగర్ మండలం

పాట, ఆట లయబద్ధంగా..

బతుకమ్మలను ఒక చోటికి చేర్చి చుట్టూ మహిళలు చప్పట్లు కొడుతూ పాటలు పాడుతారు. బతుకమ్మ పాటల్లో పూలను కీర్తిస్తూ, దేవుళ్లను తలచుకుంటూ, కష్టాలు, కన్నీళ్లను నెమరువేసుకుంటూ తమ బతుకులు బాగుండాలనే కోణంలో పాటలు ఉంటాయి.

స్టడీ హబ్‌గా కామారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి విద్యార్థులు చదువుల్లో ప్రతిభ చాటి ప్రపంచ స్థాయిలో రాణించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డిని స్టడీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆర్కే కళాశాల గ్రాడ్యుయేషన్ డేను శనివారం నిర్వహించగా ఆయన షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, ఇందులో భాగంగానే విద్యాశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉందన్నారు. దేశంలోనే ఎక్కడలేని విధంగా తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నియోజకవర్గానికి ఒకటి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ విద్యాలయాలు నిర్మిస్తామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. గత పది సంవత్సరాల్లో విద్యావ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. పేదలకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్లు సంపత్, రవీందర్, కళాశాల కరస్పాండెంట్, సీఈవో జైపాల్‌రెడ్డి, కళాశాల చైర్మన్ భాస్కర్‌రావు, డీన్ నవీన్ కుమార్, కో ఆర్డినేటర్ దత్తాత్రి, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు రేవంతన్న కానుక

- జిల్లాకు 2,03,689 ఇందిరమ్మ చీరలు
- జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు..
- గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పంపిణీ
- ఈ నెల 23 నుంచి ప్రారంభించే అవకాశం



కామారెడ్డి క్రైం: ఇందిరా మహిళా శక్తి పేరిట రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కాచెల్లెళ్లకు రేవంతన్న కానుకగా ఒక్కో సభ్యురాలికి ఒక చీర చొప్పున పంపిణీ చేయనున్నారు. కామారెడ్డి జిల్లాలో దాదాపు 2,03,689 మంది మహిళా సంఘాల సభ్యులు ఉండగా వారందరికీ చీరలు అందించనున్నామని అధికారులు తెలిపారు. జిల్లాలో 17 వేల మహిళా సంఘాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1.79 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 24,272 మంది మహిళా సంఘాల సభ్యులున్నారు. చీరలు త్వరలోనే జిల్లాకు చేరనున్నాయని అధికారులు చెబుతున్నారు. ఒక్కో చీర విలువ రూ.800 ఉంటుందని ప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పంపిణీ బాధ్యతలను వీవోలు, మెప్మా సిబ్బందికి అప్పగించనున్నారు.

సభ్యత్వం కలిగిన మహిళలకు మాత్రమే..

గత ప్రభుత్వం రేషన్ కార్డులో పేరు కలిగి ఉండి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రేషన్ షాప్‌ల ద్వారా బతుకమ్మ చీరల పేరిట ప్రతి ఏడాది దసరా ముందు చీరలను పంపిణీ చేసేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని నిలిపివేశారు. గతేడాది చీరల పంపిణీ జరగలేదు.

ప్రస్తుత ప్రభుత్వం కేవలం మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇదివరకు 60 ఏళ్లు నిండిన మహిళలకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉండేది కాదు. కానీ 60 ఏళ్లకు పైబడిన వారిని సైతం సభ్యులుగా చేర్చుకునేందుకు ప్రభుత్వం ఇటీవలే అవకాశం కల్పించింది. ఇప్పటికే జిల్లాలో 60 ఏళ్లు పైబడిన వారిని కూడా సంఘాల్లో సభ్యులుగా చేర్పించే ప్రక్రియ కొనసాగుతోంది. వారికి కూడా రేవంతన్న కానుక చీరలు అందనున్నాయి. కాకపోతే బతుకమ్మ చీరలుగా భావించి ఇస్తున్నారా, లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇంకా పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

త్వరలో జిల్లాకు చీరలు



మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం దసరా కానుకగా ప్రత్యేకంగా తయారు చేయించిన చీరలను అందజేయనుంది. ఇందుకు సంబంధించి జిల్లాలో 2.03 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులున్నారు. వారందరికీ పంపిణీ చేయడం కోసం త్వరలోనే చీరలు జిల్లాకు రానున్నాయి.

– సురేందర్, డీఆర్డీవో

పట్టపగలే దారి దోపిడీ

- తల్లీకొడుకులను అడ్డుకుని ఆరు తులాల బంగారు నగలు అపహరణ
- దుండగుడి దాడిలో కొడుకుకు గాయాలు

మద్నూర్(జుక్కల్) : మద్నూర్ మండల కేంద్రానికి సమీపంలో శనివారం పట్టపగలే జరిగిన దారి దోపిడీ స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మల్లయ్యగారి ఎల్లాగౌడ్, అతని తల్లి మల్లయ్యగారి సీతమ్మ కలిసి బైక్‌పై మద్నూర్‌లో జరిగే ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బయలుదేరారు. మద్నూర్ సమీపంలో వారు జాతీయ రహదారి 161 నుంచి మద్నూర్ వైపునకు వచ్చే సర్వీస్ రోడ్డు పైకి రాగానే వెనకాల నుంచి బైక్‌పై హెల్మెట్‌లు ధరించిన ఇద్దరు వేగంగా వచ్చి తల్లీకొడుకులను అడ్డుకున్నారు. కత్తి తీసి బెదిరించి సీతమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలను ఇవ్వాలన్నారు. దీంతో సీతమ్మ కొడుకు ఎల్లాగౌడ్ అడ్డుకోగా తోపులాట జరిగింది. ఇద్దరు దుండగులలో ఒకరి హెల్మెట్ కింద పడిపోయింది. దీంతో దుండగుడు కత్తితో ఎల్లాగౌడ్‌పై దాడి చేసి చంపేస్తామని బెదిరించాడు. అప్పటికే ఎల్లాగౌడ్ చేతికి గాయం కావడంతో భయపడిన సీతమ్మ తన ఒంటిపై గల నాలుగు తులాల బంగారు నెక్లెస్, రెండు తులాల పుస్తెల తాడు దుండగులకు ఇచ్చేసింది. నగలను తీసుకుని వారు పారిపోయారు.

సమాచారం అందుకున్న స్థానికులు తల్లీకొడుకులను మద్నూర్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. ఎస్సై విజయ్‌కొండ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ దారి దోపిడీ ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.



బాధితురాలు సీతమ్మ



చికిత్స పొందుతున్న ఎల్లాగౌడ్

కేసుల ఛేదన, సొత్తు రికవరీలో ముందంజ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర, అధికారులు

- ఇప్పటివరకు 10 అంతర్రాష్ట్ర ముఠాల పట్టివేత
- 46 శాతం కేసుల పరిష్కారం, 42 శాతం సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాల పరిశోధన, సొత్తు రికవరీలో ఈ ఏడాది జిల్లా పోలీసు శాఖ రాష్ట్రంలోనే ముందంజలో ఉందని ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. 'వెంబడించి, పట్టుకుని, పరిష్కరించడం' అనే నినాదంతో సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది ఆస్తి సంబంధిత దొంగతనాల్లో 46 శాతం నేరాలను ఛేదించామన్నారు. వాటిలో 42 శాతం సొత్తు రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రతి రోజూ నాకాబందీ, పెట్రోలింగ్, బీట్ డ్యూటీలను పెంచామన్నారు. చోరీల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీసీఎస్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రారంభం నుంచి అంతర్రాష్ట్ర దొంగల ముఠాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 10 ముఠాలను పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. సొత్తును రికవరీ చేసి బాధితులకు తిరిగి అప్పగించడంలో రాష్ట్రంలోనే జిల్లా అత్యుత్తమ స్థానంలో నిలిచిందన్నారు. కేసుల ఛేదన, సొత్తు రికవరీలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సై ఉస్మాన్, సిబ్బందిని అభినందించి రివార్డులను అందజేశారు. నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అందించాలని కోరారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఊరెళ్తే జాగ్రత్త..

కామారెడ్డి క్రైం: దసరా పండగకు ఊళ్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు రావడంతో చాలా మంది ప్రజలు తమ స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారని, దుండగులు ఇదే అదునుగా చోరీలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇళ్లలో బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులు ఉంచొద్దని సూచించారు. గ్రామాలకు వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలను తమ సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ప్రయాణాలలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, పరిమిత వేగంతో వెళ్లాలని సూచించారు.

రహదారుల నిర్మాణంలో సమస్యలను పరిష్కరించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: రహదారుల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రహదారుల నిర్మాణ ప్రక్రియకు సంబంధించిన భూసేకరణ అంశంపై శనివారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లా డారు. రహదారుల నిర్మాణ ప్రక్రియలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వివరాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీఎస్‌కు వివరించారు. డీఎఫ్‌వో నిఖిత, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏటీఎం తెరిచేలా చూడాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఏటీఎం 24 గంటలు తెరిచేలా చూడాలని స్థానిక పెద్దకొడప్‌గల్ ప్రజలు కోరుతున్నారు. మండలం మొత్తానికి కెనరా బ్యాంక్ ఒక్కటే ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దానికి తోడు ఉన్న ఏటీఎం కూడా మూసి ఉంచడంతో డబ్బులు అత్యవసరమైతే పక్క మండలాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోయారు. బ్యాంక్ అధికారులు స్పందించి మరో ఏటీఎంను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి టీఎల్ఎం పోటీలకు మాచారెడ్డి ఉపాధ్యాయులు



మాచారెడ్డి: టీఎల్ఎం పోటీలకు మాచారెడ్డి మండల ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి టీఎల్ఎం పోటీల్లో మండలంలోని చంద్రునాయక్ తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు రామేశ్వరి ఆర్టిస్టిక్ యోగ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే ఎంపీపీఎస్ ఎల్లంపేట పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గణిత విభాగంలో, మాచారెడ్డి మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సుష్మ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఎంఈవో కార్యాలయంలో వీరిని సత్కరించారు. ఎంఈవో దేవేందర్‌రావు, కాంప్లెక్సు హెచ్ఎం వెంకటచారీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అయిలాపూర్ ఉపాధ్యాయురాలు..



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు పద్మ రాష్ట్ర స్థాయి టీఎల్ఎం పోటీలకు ఎంపిక కావడంతో శనివారం ఎంఈవో షౌకత్‌అలీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో సృజనాత్మక టీఎల్ఎం తయారు చేసి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం శారదామాత

- ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు
- ప్రతి పౌర్ణమికి శ్రీనవదుర్గ సామూహిక వ్రతాలు



శారదా మాత ఆలయం , అమ్మవారి నిజరూప దర్శనం(ఇన్‌సెట్‌లో..)

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శారదా ఆలయం, విద్యా గణపతి అభయాంజనేయ సహిత శారదా ఆదిశంకరాచార్య, నవగ్రహ దేవతల ఆలయం భక్తుల కోర్కెలు తీరుస్తూ విరాజిల్లుతోంది. ప్రతి ఏటా వసంత పంచమికి శారదామాత సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం, దసరా నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేక అలంకరణ చేయడం ఇక్కడి ప్రత్యేకత. కార్తీక మాసంలో ఆకాశ దీపోత్సవం, సామూహిక కుంకుమార్చనలు, ప్రతి శుక్రవారం విశేష పూజలు, వినాయక నవరాత్రి ఉత్సవాలు, ప్రతి మంగళ, శనివారాల్లో ఆంజనేయ స్వామి చందనోత్సవాలుంటాయి. అలాగే శనివారం నవగ్రహదేవతలకు విశేషపూజలు, ప్రతినెల పౌర్ణమికి శ్రీ నవదుర్గ సామూహిక వ్రతాలు, అన్నదానాలుంటాయి. 45 ఏళ్ల క్రితం హౌసింగ్‌బోర్డు కాలనీ ఏర్పాటైన తర్వాత స్థిరాస్తి వ్యాపారులు, కాలనీవాసుల సహకారంతో అంజనేయస్వామి ఆలయం నిర్మించారు. అనంతరం వేదపండితులు గంగవరం అంజనేయ శర్మ సూచనల మేరకు శ్రీశారదా మాతా, ఆదిశంకరులు, విద్యా గణపతి, నవగ్రహాల మండపం, నవరాత్రి ఉత్సవాల నిర్వహణతో ఆలయం ప్రాచుర్యంలోకి వచ్చింది. దసరా నవరాత్రి ఉత్సవాల్లో నిత్యహోమాలతో పాటు అన్నప్రసాదం ఉంటుంది. ప్రతి వసంత పంచమికి వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. కాలనీ మహిళ భక్తులు బృందంగా ఏర్పడి నిత్యం సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఇక్కడి విశేషం. ప్రముఖ దేవాలయాల్లో నిర్వహించే అన్ని సేవలను ఇక్కడి శారదామాత అమ్మవారికి నిర్వహించడం ద్వారా అనతి కాలంలోనే పేరు పొందింది. అలాగే నవగ్రహాలకు ప్రత్యేకంగా మండపం నిర్మించారు. గ్రహాల దోషాలకు విశేష పూజలు చేస్తుంటారు. ఎంతో మంది ప్రముఖులు, ఆధ్యాత్మిక గురువులు, పీఠాధిపతులు కామారెడ్డికి వచ్చిన సందర్భంలో అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు తీసుకుంటారు.

22 నుంచి నవరాత్రి ఉత్సవాలు

ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల పెంటయ్య, ప్రధాన కార్యదర్శి గరిపల్లి శ్రీధర్‌గుప్తాలు తెలిపారు. అమ్మవారు రోజుకో రూపంలో దర్శనం ఇస్తారని, ప్రతిరోజు 6 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు కార్యక్రమాలుంటాయన్నారు. విశేష పూజల్లో పాల్గొనే వారు ముందుగా సంప్రదించాలన్నారు. అలాగే పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలోని లలితా త్రిపుర సుందరి ఆలయంలోనూ ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు.



పెంటయ్య, అధ్యక్షుడు, ఆలయ కమిటీ

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

- రేపటి నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు
- ఉత్సవాలకు సిద్ధమైన మండపాలు



బాన్సువాడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. సరస్వతి దేవి ఆలయం, కోట దుర్గాదేవి ఆలయం, పాత బాన్సువాడ దుర్గామాత ఆలయాలతో పాటు ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేశారు. దేవినవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి రోజూ భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తారు. 22న బాలాత్రిపుర సుందరి దేవి, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయని దేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న లలిత త్రిపుర సుందరి దేవి, 28న మహాచండీ దేవి, 29న సరస్వతి దేవి, 30న దుర్గాదేవి, వచ్చే నెల 1న మహిశాసుర మర్దిని దేవి, 2న రాజరాజేశ్వరి దేవి, 3 కోట దుర్గమ్మ దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. ఆలయాలు, మండపాల్లో ప్రతి రోజు కుంకుమార్చనలు నిర్వహించనున్నారు.

ముస్తాబవుతున్న మండపాలు



కామారెడ్డి రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత మండపాలను ముస్తాబు చేస్తున్నారు. శరన్నవరాత్రులకు గ్రామాల్లో సైతం పట్టణాలతో పోటీ పడి భారీ సెట్టింగులు వేస్తున్నారు. దేవునిపల్లి, టేక్రియాల్, గర్గుల్, చిన్నమల్లారెడ్డి, నర్సన్నపల్లి, క్యాసంపల్లి, లింగాపూర్ తదితర గ్రామాల్లో సెట్టింగులు వేస్తున్నారు. యువకులు భారీ సంఖ్యలో మాలధారణ వేయడానికి సిద్ధమయ్యారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో జరిగే దుర్గామాత దేవీనవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై మురళి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని మాగార్డెన్‌లో శనివారం నిర్వహించిన శాంతి సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎవరైనా ఇతరుల కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాలలో మద్యం సేవించవద్దని, జూదం ఆడవద్దని సూచించారు.

మున్సిపల్ ఏఈ బదిలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈ శంకర్ శనివారం బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బదిలీపై కామారెడ్డికి వచ్చిన ఆయన్ని నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ, సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన శనివారం కామారెడ్డి నుంచి రిలీవ్ అయ్యారు. అధికారులు, సిబ్బంది ఏఈని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సోమవారం నిజామాబాద్‌లో విధుల్లో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

23న కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: జెన్‌కేర్ హెల్త్‌టెక్‌లో టీం లీడర్లు, సేల్స్ అధికారులు, ఫీల్డ్ అధికారుల ఉద్యోగాల కోసం ఈనెల 23న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రజనీకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సొంత ద్విచక్ర వాహనం కలిగి, ఏదైనా డిగ్రీ చదివి, 30 ఏళ్ల లోపు ఉన్న యువతీయువకులు హాజరుకావాలని, 240 ఖాళీలున్నట్లు పేర్కొన్నా రు. జెన్‌కేర్ హెల్త్‌టెక్ ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చిన వారికి మెడికల్ లోన్లు అందిస్తుందని, ఎంపికైన వారికి నెలకు రూ. 20 వేల వేతనం, రూ.5వేల ట్రావెల్ భత్యం, ఇ తర సౌకర్యాలుంటాయని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించి మరిన్ని వివరాలకు 80746 96931, 76719 74009 నంబర్లను సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు గుప్పెడు బియ్యం

- మహిళా సంఘాలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



బాధిత కుటుంబాలకు బియ్యం ప్యాకెట్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: వరద బాధితులను 'గుప్పెడు బియ్యం' కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలు ఆదుకోవడం అభినందనీయమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రాజంపేట మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో 'గుప్పెడు బియ్యం' పేరుతో కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బాధిత కుటుంబాలకు సహాయం చేయడానికి రాజంపేట మండలం లోని 20 గ్రామ సంఘాల పరిధిలో ఉన్న 584 స్వయం సహాయక సంఘాల సభ్యులు ముందుకు వచ్చి 22 క్వింటాళ్ల బియ్యంను సేకరించారని అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నడిమి తండా, ఎల్లాపూర్ తండాలకు చెందిన బాధిత కుటుంబాలకు బియ్యం బ్యాగులను అందజేశారు. ఆపద సమయంలో బాధితులకు మేమున్నామనే భరోసా ఇస్తూ సహాయం చేసిన మహిళా సంఘాలు ఆదర్శంగా నిలిచాయని అభినందించారు. మహిళా సంఘాలను స్ఫూర్తిగా తీసుకుని ఇతర సంఘాలు, సంస్థలు, ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో ఉన్నవారు వరద బాధితులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఆర్డీవో సురేందర్, అదనపు డీఆర్డీవో విజయలక్ష్మి, ఏపీఎం రాజారెడ్డి, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి లత, కోశాధికారి లావణ్య, నడిమి తండా, ఎల్లాపూర్ తండాల లబ్ధిదారులున్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

భిక్కనూరు: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని రేషన్ డీలర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. 2023 శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతో పాటు క్వింటాలుకు రూ.300 కమీషన్ చెల్లిస్తామని తెలిపిందని రేషన్ డీలర్లు.. షబ్బీర్‌అలీకి గుర్తుచేశారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగం సురేందర్, గౌరవ అధ్యక్షుడు గొరిశెట్టి రాజు, భిక్కనూరు రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు తాటిపల్లి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందజేస్తా



చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు: పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌తో పాటు అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

అనంతరం చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సువిశాలమైన పచ్చని చెట్ల మధ్య ఉన్న సౌత్‌క్యాంపస్‌ను పై స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి విన్నవించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లే విధంగా ప్రయత్నిస్తానన్నారు. అధ్యాపకులు నారాయణ గుప్తా, లలిత, సునీత, యాలాద్రి శ్రీమాత, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమి సరిహద్దులో కందకాలు ఏర్పాటు



అటవీప్రాంతానికి తరలివచ్చిన గ్రామస్తులు

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం కులాస్‌పూర్ తండాలోగల అటవీ భూమిలో కందకాలను శనివారం ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న గిరిజనులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈక్రమంలో అటవీ భూమిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తారేమోనని గిరిజనులు అటవీ అధికారులను అడ్డుకున్నారు. సమాచారం అందిన వెంటనే రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ సుస్మిత సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎఫ్ఆర్‌వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ప్రస్తుతానికి అటవీ భూమిలో కందకాలు ఏర్పాటు చేశారు. మొక్కజొన్న పంట పూర్తయ్యాక ఆ భూమిలో నుంచి ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని అటవీ అధికారులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులను పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న సాయంత్రం గాంధీనగర్‌కు చెందిన దండేపల్లి అనసూయ తన మనువడిని పాఠశాల నుంచి ఇంటికి తీసుకువస్తోంది. ఈక్రమంలో ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి 3తులాల బంగారం గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా బైక్ వివరాలను గుర్తించారు. నిందితులుగా రామేశ్వర్‌పల్లికి చెందిన భాస్కర్ రెడ్డి, బాబాగౌడ్‌లుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి చైన్‌ను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

క్రైం కార్నర్

దుబాయిలో తిప్పాపూర్ వాసి మృతి



సుధాకర్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దుబాయిలో ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గౌడుగు సుధాకర్ (38)ఇటీవల జీవనోపాధి కోసం దుబాయి దేశానికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి అతడు విధులు ముగించుకుని బంగ్లా పైనుంచి కిందకు వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఈ విషయం సుధాకర్ కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం రావడంతో వారి రోదనలు మిన్నంటాయి. సుధాకర్ మృతదేహన్ని స్వగ్రామానికి రప్పించేందుకు అక్కడ కార్మికులుగా పనిచేస్తున్న తిప్పాపూర్ వాసులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందించారు. ఈనెల 23న సుధాకర్ మృతదేహం తిప్పాపూర్ గ్రామానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ ఒకరు..



అక్కారం రవి (ఫైల్)

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాలు ఇలా.. మెండోరా మండల కేంద్రానికి చెందిన అక్కారం రవి(36) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 16న ఇంట్లో భార్యతో గొడవ పడి ఆవేశంలో డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



అజార్ (ఫైల్)

వర్ని: మండల కేంద్రంలోని వీఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రుద్రూర్ మండలం అక్బర్ నగర్ గ్రామానికి చెందిన అజార్ (25) శనివారం రాత్రి బైక్‌పై నిజామాబాద్ వైపు నుంచి వర్ని వైపు బయలుదేరాడు. వర్నిలోని వీఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద అతడిని నిజామాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి కరెంట్ షాక్‌తో ఆవు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పాకాల జంగం లింగంకు చెందిన ఆవు తన వ్యవసాయ బావి వద్ద మేత మేస్తుండగా బోరు బావికి సంబంధించిన విద్యుత్ స్టార్టర్ బాక్స్‌కు తగిలింది. దీంతో ఆవుకు కరెంట్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందన్నారు. విద్యుత్ అధికారులు, పశువైద్య సిబ్బంది శనివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని లింబుర్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు డోంగ్లీ ఆర్ఐ సాయిబాబా శనివారం తెలిపారు. పోతంగల్ మంజీర ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లో డుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, మద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైన అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయిల్స్, ఇతర ఉపకరణాలను దొంగలించారు. విషయం తెలుసుకున్న లిఫ్ట్ చైర్మన్ నర్సారెడ్డి రైతులతో కలిసి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.5లక్షలు విలువ చేసే ఉపకరణాలు దొంగలించడ్డాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మెడికల్ షాపులో తనిఖీలు



వర్ని: మండల కేంద్రంలోని మెడ్‌ప్లస్ మెడికల్ షాపులో శనివారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల దుకాణంలోని ఓఆర్ఎస్ ప్యాకెట్‌లో చెత్త రావడంపై బాధితులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు దుకాణాన్ని తనిఖీ చేసి, శాంపిల్స్ సేకరించారు. చెత్త వచ్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్‌తోపాటు ఆ బ్యాచ్‌కు సంబంధించిన ప్యాకెట్లు అన్నింటిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ బ్యాచ్‌కు చెందిన ఓఆర్ఎస్ ప్యాకెట్లన్నింటిని రాష్ట్ర వ్యాప్తంగా రీకాల్ చేయిస్తామని వెల్లడించారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాము కాటుతో బాలుడికి గాయం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



బాలుడిని కాటేసిన కట్లపాము.. భాస్కర్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): కట్ల పాము కాటేయడంతో గాయపడ్డ బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన గంగుల రాజమణి- నర్సింలు దంపతులకు కూతురు, కుమారుడు గంగుల భాస్కర్(3) ఉన్నారు. ఈ నెల 12న రాజమణి పిల్లలతో కలిసి మహమ్మద్ నగర్‌లోని తన తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 17న ఇంట్లో వారు నిద్రించగా, అర్ధరాత్రి వేళ భాస్కర్ రోధించడంతో కుటుంబసభ్యులు నిద్రలేచారు. ఇంట్లో పరిశీలించగా వారికి కట్ల పాము కన్పించింది. దీంతో భాస్కర్‌ను కాటువేసిందని గుర్తించి పామును చంపి, బాలుడిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే పాము కాటుతో బాలుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతిపై తల్లిదండ్రులు నిజాంసాగర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

సిలిండర్ లీక్‌తో అగ్నిప్రమాదం



మద్నూర్(జుక్కల్): మండలంలోని రూసేగావ్‌కు చెందిన కాంబ్లే శంకర్ ఇంట్లో గ్యాస్ సిలెండర్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. శంకర్ కుటుంబీకులు శనివారం ఉదయం ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా సిలెండర్ నుంచి గ్యాస్ లీకవడంతోపాటు మంటలు అంటుకున్నాయి. వెంటనే ఇంట్లోని వారంతా బయటకు పరుగులు తీశారు. స్థానికులు మద్నూర్‌లోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైరింజన్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేకొని, మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 60వేల ఆస్తి నష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు. ఇంట్లో ఉన్న తులం బంగారు నగలు, 15 తులాల వెండి వస్తువులు మంటల్లోంచి లీడింగ్ ఫైర్‌మెన్ తీసి ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్.. ఇళ్లపై తెగిపడిన విద్యుత్ వైర్లు



నవీపేట: మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీలో విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొనడంతో పలువురి ఇళ్లపై 11 కేవీ కరెంట్ తీగలు తెగిపడ్డాయి. స్థానికులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా.. నవీపేటలో రైల్వేట్రాక్ నిర్మాణంలో భాగంగా భారీ టిప్పర్‌లు మొరం, కంకరలతో కాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈక్రమంలో శనివారం విద్యుత్ స్తంభానికి ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ తీగలు తెగిపోయి, కిందనున్న మూడు ఇళ్లపై పడ్డాయి. వెంటనే కాలనీవాసులు ఇళ్లలోని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగలను సరి చేశారు.